

పెద్దకథ

# దేవతలు తిరిగే చోటు

-జయ

(గత సంచిక తరువాయి)

"మరి ... మరి ... నన్ను వదిలేసిందిగా–"

సారిక మెత్తగా, ఆప్యాయంగా నవ్వి – "ఆమె భర్త లేనందువలన, వైదేహి పని, ఆలోచన, భావన అన్నీ నీ చుట్టూ అల్లుకున్నాయి. కానీ – చంద్రం రాగానే, ఆమె భర్తకి ఉపగ్రహం అయ్యింది."

"కానీ – అలా నన్ను ఒకేసారి నిర్లక్ష్యంగా వదిలేస్తే – నేను హర్ట్‌కానా? నా ఫీలింగ్స్ సంగతి – అంటే సారికా, నేను ఇలా రిజెక్టెడ్‌గా ఫీల్ అవ్వడం తప్పంటావా?"

"కాదు. వైదేహికి భార్య, వదిన పాత్రల్ని బాలెన్స్ చెయ్యడం తెలీలేదు. నీ ఆలంబన అవసరం పోగానే నిన్ను వదిలేసింది"

"మరి అది తప్పు కాదూ–"

సారిక క్షణం ఆలోచించి – "నువ్వు మీ వదినని అంత ప్రేమించాక, ఇప్పుడు తప్పొప్పుల సమస్య ఎందుకు రామ్. ఆవిడ నిన్ను నిర్లక్ష్యించి హర్ట్ చేసిందని, అది చూపించడానికి నువ్వు ఆవిడకి నచ్చని పని, తాగి ఇంటికి వెళ్ళడం, ఇంట్లో నిర్లక్ష్యంగా ప్రవర్తించడం, భోజనం చెయ్యకుండా పళ్ళాలు విసరడం – ఇవ్వన్నీ చేసి – తిరిగి ఆవిడ్ని హర్ట్ చెయ్యడానికి ప్రయత్నించావు. నిజమైన ప్రేమ బాధని భరిస్తూ ఉన్నతంగా ఎదగాలి కానీ ఇంకా చీప్‌గా దిగజారకూడదు. ఏం రామ్–"

రామ్ కళ్ళల్లో అప్రయత్నంగా కన్నీరు తిరిగింది. ఎందుకో లోలోపల అణుచుకుంటూ వచ్చిన ఈ అసహజ దుఃఖాన్ని, వేదనని ఇలా చెప్పడం ఆ మానసిక బాధకి ఇంత విపులమైన వివరణ వినడం అతనికి కొంత శ్వాస చిక్కినట్టు రిలీఫ్ ఫీలయ్యాడు.

"నిజమే. నాకు స్థిరత లేదు. బాలెన్స్ పోయింది. అది తట్టుకోలేక పిచ్చిపిచ్చిగా ఆలోచించడమే కాదు ప్రవర్తించాను కూడా–"

"ఇక అదంతా ఎందుకు ప్రతీక్షణం తవ్వుకోవడం. మర్చిపో రామ్–"

"ఎలా సారికా – నా వల్లకాదు. నాకు మా వదిన చూపించిన ఆపేక్ష, ఆప్యాయతలు కావాలి. అవి లేకుండా నేను బ్రతకలేను. నా వయసు అబ్బాయిలు వున్నట్టు నేను ఒంటరిగా కాలక్షేపవు పిచ్చి పనులు చేసుకుంటూ తిరగలేను"

"నాకు తెలుసు రామ్–"

"ఏమిటి?"

"నీకు తల్లి కావాలి. ఎప్పుడూ నీ గురించి ఆలోచిస్తూ, ఎదురు చూస్తూ, ప్రేమిస్తూ – నీ చుట్టూ తన ఆపేక్షని, మాతృత్వాన్ని ఆప్యాయంగా అల్లుకోగలిగే మాతృమూర్తి కావాలి–"

రామం కళ్ళు మెరిశాయి. ఎంత బాగా అర్థం చేసుకోగలిగింది.

"కానీ రామ్. ఏ తల్లయినా తొమ్మిది మాసాలు. ఆ తర్వాత పిల్లాడు పాకడం, నిలబడడం, నడవడం, పరిగెత్తడం వరకు ఆసరాగా వుంటుంది. అంతకు మించి కాదు–"

రామ్ తమాషాగా – "సరే! నేను ఏ స్థితిలో వున్నాను–?"

"నువ్వు తల్లి ప్రేగు తెంచుకుని బయట ప్రపంచంలోకి వచ్చినా కూడా – ఇంకా తల్లి ప్రేమ అనే దగ్గరి 'స్పర్శ'ని – గర్భంలో పసికందుకి వుండే 'రక్షణ'ని కోరుకుంటున్నావు. అది అందీ – అందకపోయేసరికి ఇన్‌సెక్యూరిటీతో బాధపడుతున్నావు–"

"అందుకే ఆ అభద్రతాభావం పోవడానికి నాకు ఎవరో తోడు కావాలి.' అని ఆగి – "ఎవరో కాదు మా వదిన కావాలి–"

సారిక నిట్టూర్చింది.

"మీ వదినకి ఇంత ఎనాలిసిస్ తెలీదు. తెల్సినా బహుశ ఓపిక లేదేమో. నీలాంటి పిల్లాడ్ని భరించడానికి చాలా ధీరత, ఓపిక కావాలి"

"మరి–"

"రామ్ – నేను నీకు తల్లినవుతా. ఈ అమ్మ నీకు నచ్చిందా?–"

ఆ మాటలు అతడ్ని ఒకరకమైన ట్రాన్స్‌లోకి తీసుకువెళ్ళాయి. కేవలం ఒక స్త్రీ మాట్లాడే రెండు వాక్యాలకి అంత శక్తి వుంటుందని అతను ఊహించలేదు. 'ఓం'కారం లోంచి సమస్త సృష్టి ఆవిర్భవించినట్టు, ఆమె ఉచ్చరించే శబ్దాల్నించి రామం నూతన వ్యక్తిత్వం రూపుదిద్దుకుంటోంది. సారిక మాటలకి అతని హృదయంలో పవిత్ర గంగామాత పొంగి ఊపిరి తిరగనంత ఆర్ద్రతతో అతడ్ని ముంచేస్తోంది. ఆమె చూపిస్తున్న ఆపేక్ష వెల్లువకి రామం ఆనంద తమకంతో, చిన్న పసి గరికలా వంగిపోతున్నాడు.

వామనుడి ముందు తల వంచిన బలి చక్రవర్తిలా – తనకన్నా వయసులో చిన్నదైనా – ఈ అమ్మాయి సంపూర్ణ వ్యక్తిత్వం ముందు తన అపరిపక్వ మనస్తత్వానికి సిగ్గుపడ్డాడు.

"ఏం రామ్ మాట్లాడవు?"

ఆత్మానుభూతి ప్రవాహంలో ఈత కొడుతున్నా, అప్పుడప్పుడు 'మునిగిపోతానేమో' అనిపించే పసితనపు అజ్ఞానాన్ని వదల్లేక – "మా వదినలా నువ్వు

నన్ను వదిలేయకూడదు. ఎప్పటికీ వుండిపోవాలి-" అన్నాడు.

"రామ్ - నీ ఎదుగుదలకి నేను ఎంతవరకు అవసరమో అంతవరకు వుంటాను-"

"అంటే-?"

"అది నీకే తెలుస్తుంది-"

"తర్వాత -"

"నీకు ఎవరూ అవసరం వుండరు. పరిపూర్ణ వ్యక్తిత్వంతో వికసించిన నువ్వు నీ మార్గం వెతుక్కుంటూ వెళ్ళగలవు-"

"మార్గం ఎలా తెలుస్తుంది?"

"జిజ్ఞాస వున్నవాళ్ళకి మార్గం అదే తెలుస్తుంది-" ప్రేమ వున్న చోట దుఃఖం వుంటుంది. సంపెంగలు వున్న చోట పాములుంటాయి. దేవతలు తిరిగే చోట దయ్యాల నృత్యం వుంటుంది. సృష్టి వున్న చోట నాశనం వుంది-"

"ఎందుకలా?"

"అది జీవన సూత్రం. ఆ సూత్రంలోనే విశ్వం తిరుగుతోంది-"

"మరి అర్థం?"

"ఉంది. ఆత్మచైతన్యంతో వెతుక్కుంటే అర్థం దొరుకుతుంది. అప్పడే ఈ అర్థంలేని వెంపర్లాట పోతుంది- "

"మనశ్శాంతి దొరుకుతుందా?"

"ఊ. మనశ్శాంతి, ఆత్మ సంతృప్తి కూడా."

"ఒకవేళ నేను మళ్ళీ మార్గం తప్పి - జారిపోతే-"

ఆమె గర్వంగా అంది - "మా అబ్బాయి దారి తప్పడు-"

అది చాలు. తన మీద ఆ మాత్రం విశ్వాసం ప్రదర్శిస్తే - దాన్ని నిలబెట్టుకోవడానికి తను ఫలవంతంగా ఎదుగుతాడు.

***

రామం ఇప్పడు ఎం.ఎస్‌సి. గోల్డ్ మెడలిస్టు. కాలిఫోర్నియా యూనివర్సిటీ జెనెటిక్స్ రీసెర్చి విభాగానికి రీసెర్చి అసిస్టెంట్‌గా వెళ్లబోతున్నాడు. వింబుల్డన్ టెన్నిస్ ఛాంపియన్ టైటిల్ కోసం ప్రాక్టీస్ చేస్తున్నాడు. ఇప్పడతను - గాలి లేని శూన్యంలో కూడా బాలెన్స్‌తో ఎగిరే గరుడ పక్షి.

"నేను జెనెటిక్స్‌లో కొత్త ప్రయోగాలు చేసి సూపర్‌మేన్‌ని సృష్టిస్తా సారికా-"

సారిక తేలిగ్గా నవ్వింది.

"ఏం నమ్మవా?"

"ఎందుకు నమ్మను రామ్. నాకు నీలో చాలా నమ్మకం వుంది" అని ఆగి "రేపు మా ఇంట్లో ఫంక్షన్‌కి నువ్వు రావాలి-" ఉత్సాహంగా 'ఏం ఫంక్షన్' అన్నట్టు చూశాడు.

"నాకు శేఖర్‌తో నిశ్చితార్థం. నీకు తెల్సుగా-"

రామం తల వూపాడు. సారిక - తన క్లాస్‌మేట్ శేఖర్‌ని పెళ్ళి చేసుకోవాలనుకుంటోంది అని తనకు మాటల మధ్య చెప్పింది. కానీ -




ఆ క్షణాన్నే అతనికి తెలిసింది - లోలోపల సారిక తనకే వుండిపోవాలనే కోరిక తనలో ఎంతగా వుందో అని.

రామం గబుక్కున లేచి బయటకు వెళ్ళిపోయాడు. సారిక అతను వెళ్ళిన వైపు చూసి నిట్టూర్చింది.

మరునటి రోజు ఉదయం ఒక పాకెట్ పట్టుకుని - లోపలికి వచ్చి - పుస్తకం చదువుకుంటున్న ఆమె ముందుకి సరాసరి వచ్చి - "ఇదిగో" అని అందించాడు.

సారిక మౌనంగా పాకెట్ విప్పింది. ఆమెకు ఇష్టమైన కనకాంబరం రంగు పట్టుచీర, జాకెట్టు, అవే రంగు గాజులు-

"రామ్-" అంది సంబరంగా.

రామ్ చిర్నవ్వు నవ్వుతూ - "గ్రుడ్డివాడికి వెలుతురిని ఇచ్చి - మాయమైంది మా వదిన. ఆ వెలుతురులో ప్రకాశం చూడడం ఎలాగో నువ్వు నేర్పావు. మీరు దేవతలు. ఇది దేవతలు తిరిగే చోటు" అని నవ్వాడు.

***

ఆ రోజు శుక్రవారం. ఎందుకో - ఆ రోడ్డు మీద నడుచుకుంటూ వెళుతూ - గుడిని చూసి - 'దేవి' దర్శనం చేసుకోవాలని లోపలికి వెళ్ళాడు. సర్వాలంకార శోభితురాలైన ఆవిడని చూస్తుంటే వదిన గుర్తొచ్చి - చూడాలనిపించింది. ఆ ఆలోచనే అతనిలో విపరీతమైన ఆనందాన్ని సృష్టించింది. ఇన్ని రోజులూ - ఒక రోజున వదినని చూసి మాట్లాడతాడు అనే భావన అతను అపురూపంగా హృదయంలో దాచుకుంటూ వచ్చాడు.

అప్పటికి సమయం తొమ్మిదవుతోంది. రామం వదినతో, అన్నయ్యతో ఏం మాట్లాడాలా అని ఆలోచించుకుంటూ నడుస్తున్నాడు. ఇంత వరకు అతను ఆ ఇంటికి ఏ 'అవసరం' కోసమూ వెళ్ళలేదు. పొలం మీద వచ్చే అతని వాటా ఆదాయం - బ్యాంక్ ఎక్కౌంట్‌లో జమ అవుతూ వచ్చింది.

తన గమ్యం చేరుకోగానే - గోడ బయటే ఆగిపోయాడు. వరండా లైటులో - చీకటి, వెలుతురుల మధ్య - చెంగు భుజం నిండుగా కప్పకుని కూర్చున్న వదిన. సరిగ్గా అప్పడే ఒక రిక్షా ఇంటి ముందు ఆగింది. ఆ శబ్దానికి ఆమె కదిలి గేటు దగ్గరకు వచ్చింది. చంద్రం రిక్షాలోంచి కొద్దిగా తూలి, కిందకి అడుగువేశాడు. ఆమె కంగారుగా వచ్చి పట్టుకోబోయింది.

చంద్రం ఎర్రబడిన కళ్లు వెడల్పు చేస్తూ - క్రూరంగా చూశాడు. ఆ చూపుకి ఆమె బెదిరినట్టుగా పక్కకు జరిగింది.

రామం ఇక తట్టుకోలేకపోయాడు. "ఏవిటిది అన్నయ్యా-" అన్నాడు చీకటి తెర నుంచి వెలుగులోకి వస్తూ-

రిక్షావాడు వెళ్ళిపోయాడు.

చంద్రం - చూపుని నిలబెట్టి రామాన్ని చూసి "హ్హా హా నువ్వా-" అన్నాడు.

"వదిన లాంటి దేవతని -" అంటున్న అతని వాక్యం పూర్తిచెయ్యనివ్వకుండా - "అది మామూలు ఆడది. పచ్చి ఆడది-" అని తూలుకుంటూ లోపలకి వెళ్ళిపోయాడు.

రామానికి అర్థంకాలేదు. తన పూజకి అందని దేవత - అన్నయ్యకి అంది ఒక మామూలు ఆడది అయ్యిందా - అనుకోగానే అతనికి ఏదో అర్థం అయ్యీ అవ్వనట్టు - చిన్న విరక్తిలాంటి నవ్వు వచ్చి - నవ్వుకుని - కదిలాడు.

"రామం" అన్న పిలుపుకి అతను వదినని పరిశీలించి చూశాడు. అప్పడు పట్టాభిషిక్తురాలైన సీతామ తల్లిలా వుండే వదిన ఇప్పడు వనవాసం చేస్తున్నట్టుగా వుంది.

"ఏం వదినా-"

"నువ్వు పిచ్చివాడివి రామం-" అని లోపలికి వెళ్ళిపోయింది.

ఆ మాటకి - అతనికి వదిన మీద జాలితో కళ్లు చెమ్మగిల్లాయి.

■